# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 212

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: గురువారం 03 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ ప్లాట్‌ఫామ్‌లో అనలాగ్ డెయిరీ ప్రొడక్ట్స్‌తో తయారు చేసిన వంటకాలను విక్రయించడంపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిబంధనను ఉల్లంఘించే రెస్టారెంట్లను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే అనలాగ్ డెయిరీని ఉపయోగిస్తున్నట్లు ప్రకటించిన వంటకాలను జొమాటో డీలిస్ట్ చేసింది. జొమాటో ప్రకటన బాగానే ఉంది కానీ, ఇక్కడే మరో ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒక రెస్టారెంట్ అనలాగ్ పనీర్ వాడుతున్నట్లు జొమాటోకు చెప్పకపోతే ఏం చేస్తారు? రెస్టారెంట్లు స్వయంగా సమాచారం ఇస్తేనే చర్యలు తీసుంటారా? సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. నిజమైన పనీర్ పేరుతో అనలాగ్ పనీర్‌ను అందిస్తున్న రెస్టారెంట్లు నిజం ఎందుకు అంగీకరిస్తాయని పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అనలాగ్ పనీర్ అనేది సాంప్రదాయ పాలతో తయారు చేసే పనీర్ కాదు. దీనిని పాల పదార్థాలతో కాకుండా నాన్-డెయిరీ పదార్థాలతో తయారు చేస్తారు. పాల కొవ్వుకు బదులుగా తక్కువ ఖర్చుతో లభించే వెజిటబుల్ ఆయిల్స్‌ను ఉపయోగిస్తారు. ఇది ఆరోగ్యానికి సురక్షితం కాదు. అనలాగ్ లేదా నాన్-డెయిరీ పనీర్‌పై దేశవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. పలు రాష్ట్రాల్లో ఈ ఫేక్ పనీర్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, విక్రయంపై నిషేధాలు అమల్లోకి వచ్చాయి.




**సమయం ప్రతినిధి:** అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. ఈ మేరకు జన్మభూమి ట్రస్ట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ.. 39 ఏళ్లపాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందించిన జితేంద్ర మిశ్రాను ఆలయ ట్రస్ట్ సీఈఓగా నియమిస్తున్నట్టు ప్రకటించింది. భారత వైమానిక దళానికి సంబంధించిన ఎన్నో ఆపరేషన్లలో కీలకంగా పని చేసిన మిశ్రా.. గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్ట్రన్ కమాండర్‌గా సేవలందించారు. 2026 ఏప్రిల్లో ఆయన ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా రిటైరైయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో తన కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సర్వోత్తమ యుద్ధ సేవ మెడల్‌ను కూడా అందుకున్నారు.

**ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులు..**

రామాలయ ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులను కూడా కమిటీ నియమించింది. మదన్ మోహన్ పాండే, మహేశ్ భగచంద్కా, నిర్మలా యాదవ్‌లను సభ్యులుగా ఎంపిక చేసింది. కొన్ని నెలల క్రితం అయోధ్య రామాలయ విరాళాల్లో దుర్వినియోగం జరిగిన విషయం తెలిసిందే. అందుకే ట్రస్ట్ ప్రక్షాళన దిశగా ఈ మేరకు మార్పులు అనివార్యమయ్యాయి. రాములోరి నిధులు కాజేసిన కేసులో ఎనిమిది మంది ఇప్పటికే అరెస్టయ్యారు. దీంతో అప్పటి జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా దేశంలో దుమారం రేగిన సంగతి తెలిసిందే.




**సమయం ప్రతినిధి:** తమిళనాడులోని దేవాలయాల్లో రీల్స్ చిత్రీకరించే యువతకు బుద్ధి చెప్పేందుకు విజయ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 52 ప్రధాన దేవాలయాలలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై టీవీకే ప్రభుత్వం పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచే అమలులోకి వచ్చాయి. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆలయాలలో కొంతమంది భక్తులు, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేస్తున్నారు. అలా వీడియోలు తీయడం వల్ల ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. ఇతర భక్తుల ప్రశాంతతకు భంగం కలుగుతోంది. అందుకే ఈ చర్యలు చేపట్టాము' అని తెలిపారు.

**సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేక కౌంటర్లు..**

భక్తులు తమ స్మార్ట్‌ఫోన్లను ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్రపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం ఫోన్‌కు 5 రూపాయల చొప్పున డిపాజిట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కెమెరాలేని కీప్యాడ్ మొబైల్ ఫోన్లను ఆలయంలోనికి తీసుకెళ్లడానికి అనుమతి ఉంది.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)లో హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ వచ్చింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లో ఈరోజు (బుధవారం) నిర్వహించిన బహిరంగ వేలంలో 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లు రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఈ వేలంలో గజం భూమి గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయించడం హాట్‌టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో భూముల ధరలు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ వేలం మరోసారి స్పష్టం చేసింది. అధికారులు నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో ఒక్కో గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, వేలంలో పలువురు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగా పెరిగాయి. అత్యధికంగా ఒక ప్లాట్ గజం రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. మరో ప్లాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయించారు. అదేవిధంగా మరో రెండు ప్లాట్లు గజం రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. ఈ వేలంలో మొత్తం 19 మంది బిడ్డర్లు ఉత్సాహంగా పాల్గొని ప్లాట్ల కోసం పోటీపడ్డారు. ఈ పోటీ కారణంగా హౌసింగ్ బోర్డు నిర్దేశించిన కనీస ధర కంటే అనేక ప్లాట్లు అధిక ధరలకు విక్రయమయ్యాయి. మొత్తం 16 ప్లాట్ల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది. వేలంలో గజం సగటు ధర రూ.1.79 లక్షలుగా నమోదైంది. కేపీహెచ్‌బీ ప్లాట్లకు భారీ డిమాండ్ ఉన్నట్లు ఈ వేలం ద్వారా మరోసారి వెల్లడైందని అధికారులు చెప్పారు. హైదరాబాద్‌లో కీలకమైన ప్రాంతాల్లో అందుబాటులోని హౌసింగ్ బోర్డు భూములకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లకు కూడా పోటీ నెలకొంటోందని అన్నారు. ఈ వేలం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు అధికారులు వెల్లడించారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయం హౌసింగ్ బోర్డు ఆర్థిక వనరులను పెంచడంలో కీలకంగా మారనుందని తెలిపారు. కేపీహెచ్‌బీ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ ప్లాట్లకు భారీ డిమాండ్ ఉందని పేర్కొన్నారు.




**ఢిల్లీ, సెప్టెంబర్ 2, సమయం ప్రతినిధి :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో ఈరోజు (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్లాస్ షాప్ ఓనర్స్, వర్కర్స్ యూనియన్‌కు అండగా ఉంటాం : ప్రభుత్వ విప్

**(సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్) :** మహబూబ్‌నగర్ జిల్లా గ్లాస్ షాప్ ఓనర్స్ & వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ ఆవిర్భావ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతన యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన యూనియన్‌కు అన్ని విధాలా అండగా ఉంటానని, సభ్యుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ అభివృద్ధితో గ్లాస్, అల్యూమినియం, యూపీవీసీ రంగాలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. నగర అభివృద్ధికి శాంతియుత వాతావరణం అవసరమని, విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, ఎన్ పి వెంకటేష్, కార్పొరేటర్ ప్రశాంత్, యూనియన్ అధ్యక్షుడు మునీరుద్దీన్, నాయకులు, యూనియన్ ప్రతినిధులు, వ్యాపారులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో రిసర్వే పనులు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

### గ్రామస్థులు రిసర్వేకు సహకరించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న భూముల రిసర్వే పనులతో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా గ్రామంలో జరుగుతున్న భూముల రిసర్వే పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసర్వే ప్రక్రియకు గ్రామస్థులు పూర్తిగా సహకరించాలని కలెక్టర్ కోరారు. రిసర్వే ద్వారా భూముల వివరాలు, హద్దులు స్పష్టంగా నమోదవుతాయని, భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను నివారించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. అనంతరం ఖానాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు గుడ్లు, ఇతర పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ విద్యుత్, లైటింగ్, ఫ్యాన్ల సమస్యలను గుర్తించారు. వాటిని వెంటనే మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. దీంతో సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని సర్పంచ్, గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జెన్‌జీని మోదీ జయించగలరా?

'నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం' అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20–25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను బుట్టదాఖలు చేయాలని, తదుపరి దర్యాప్తులు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో... దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 5న పెల్లుబుకాల్సిన మరో అల్లకల్లోలం సమసిపోయినట్లేనని భావించవచ్చు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో మరోసారి శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చునని కేంద్రం భావించినందువల్లే సామరస్య వైఖరిని అవలంబించక తప్పలేదని స్పష్టమవుతోంది. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని నెల రోజులు దాటింది. అయితే కేంద్రం ఎంతకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్ క్వార్టర్స్ దాకా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో న్యూఢిల్లీలో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద అనుమతిలేని అన్ని సమావేశాలను పూర్తిగా నిషేధించారు. ఈ నిరసన ప్రదర్శనపై నిషేధం విధించాలని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయించారు. సాధారణంగా అయితే పెద్ద ఎత్తున బలగాలను తరలించి, న్యూఢిల్లీని యుద్ధ క్షేత్రంగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేసి, విద్యార్థుల ప్రదర్శనను తొక్కివేయగల శక్తి మోదీ సర్కార్‌కు ఉన్నది. విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కూడా వారిని డిజిటల్ ఆధారాలతో గుర్తించి వేధించడం కేంద్రం సహజ వైఖరికి నిదర్శనం. ఆ సమయంలో పెల్లెట్ల ప్రయోగం, ఇతర దారుణాలపై అనేక సంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిజాయితీని శంకించవలసిన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో పోలీసులు స్వైర విహారం, హింసాకాండ మూలంగా విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలిగించడమే కాక, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించక తప్పలేదు. నిరసన ప్రదర్శనను తాము నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన మర్నాడే విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తులు పెట్టుకున్నారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలలలోగా నష్టపరిహారం చెల్లిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం, తాము నిరసన ప్రదర్శనను ఉపసంహరించుకుంటున్నామని సీజేపీ ప్రతినిధులు ప్రకటించడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో జూన్––జూలై నెలల్లో జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల ప్రకంపనలు దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అర్థమవుతోంది. ఢిల్లీలో జరిపిన నిరసన ప్రదర్శనలతో ఆగకుండా సీజేపీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై ఆందోళనలకు ఉపక్రమించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష, స్కూళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీక్ సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, టీచర్ల పోస్టుల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఢిల్లీలలో ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న స్కూళ్లకు వెళ్లి 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసి 'క్యాబోల్తీ హై పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త పర్యటనలు ప్రారంభించడంతో సీజేపీకి ఏదో బృహత్తర లక్ష్యం ఉన్నట్లు భావించక తప్పడం లేదు. సీజేపీ లక్ష్యం ఏదైనా, దాని భవిష్యత్తు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప తన వైఖరి మార్చుకునే ధోరణి కేంద్రంలో కనపడకపోవడం సాధారణంగా మారింది. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరుకున్న తర్వాతే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ఇప్పుడు ఇండియాగేట్ నుంచి ర్యాలీ చేస్తామని హెచ్చరించిన తర్వాతగానీ విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం దిగిరాలేదు. ఎందుకు ప్రతి సమస్యనూ తెగేదాకా లాగి ఆ తర్వాత వెనక్కి తగ్గడం? ప్రతిసారీ ప్రభుత్వ పరువును కాపాడేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకురాలేదు కదా! దాని పరిమితులు దానికి ఉన్నాయి. ఎందుకో సమస్యలను పరిష్కరించడంలో, లేదా అంచనా వేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు ఒక మేధో యంత్రాంగాన్ని రూపొందించుకోలేకపోవడం, కేవలం బల ప్రయోగాన్నే నమ్ముకోవడమే ఇందుకు కారణం కావచ్చన్న అభిప్రాయం కలుగుతోంది. పన్నెండు సంవత్సరాల పరిపాలన తర్వాత దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో, అది కూడా విద్యార్థుల నుంచి మోదీ సర్కార్ ఎందుకు ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తోంది? కొత్త తరం ఇప్పుడు ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాల్ని ఎత్తిచూపుతోంది. వారికి మద్దతుగా కాంగ్రెస్‌తో పాటు ఇతరేతర శక్తులు కూడా తోడవుతున్నాయి. అంతమయ్యాయనుకున్న రకరకాల వామపక్షాలు కూడా ఇప్పుడు అత్యుత్సాహంతో తమ వంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా ఉపయోగంలో ఈ అన్ని శక్తులూ కలిసికట్టుగా విజృంభిస్తున్నాయి. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాల నేతలే కాదు, బిహార్‌లో తన ఉనికి కోసం పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) వంటి పార్టీ కూడా తమ విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా ద్వారా జరుగుతున్న పరిణామాలను, బీజేపీని ఎండగట్టేందుకు ఉపయోగించుకుంటున్నదంటే అన్ని వామపక్ష శక్తులూ ఎలా సంఘటితమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఈ శక్తులు ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అవి విజయం సాధించగలవా అన్నది చెప్పలేము కానీ కమలనాథులు మాత్రం ఆత్మరక్షణలో పడ్డారనడంలో సందేహం లేదు. రాజకీయ పార్టీల దృక్కోణాల్లోంచి కొత్త తరం దేశాన్ని చూడడం లేదు. కులం, మతం, ప్రాంతం, చివరకు లింగం వంటి సంప్రదాయ గుర్తింపులను కూడా ఈ తరం అధిగమించి ఒక ప్రత్యేక గుర్తింపుతో ముందుకు వచ్చిందనడంలో సందేహం లేదు. చాలా మంది సంప్రదాయ రాజకీయ నాయకులకు వారి ప్రవర్తన, భాష, జీవన శైలి, ఆందోళనలు అర్థం కావడం లేదు. ఆ నవ యువత గురించి తమ సొంత దృక్పథంలో ఆలోచించి, అవే కళ్లద్దాలతో వారిని చూడడం ప్రారంభించారు. వారిని ఆకర్షించేందుకు దయనీయ ప్రయత్నాలు చేస్తున్నారు. తమను తాము హాస్యాస్పదులుగా నిరూపించుకుంటున్నారు. ఈ ప్రయత్నాలు మానేసి నవ తరం లేవనెత్తుతున్న అంశాలను, ఆందోళనలను అర్థం చేసుకోవాల్సి ఉన్నది. విద్య, నిరుద్యోగం, జవాబుదారీ విధానం, వ్యవస్థలు తమ పనిని తాము చేయడం, అవినీతిని నిర్మూలించడం, పారదర్శకత, నిజాయితీని వారు ఆశిస్తున్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు అయిన తర్వాత ఎన్నో సంవత్సరాలకు వారు జన్మించారు. వివిధ ప్రపంచ దేశాల పరిస్థితుల గురించి తెలిసినవారు. ఎంతసేపూ మత రాజకీయాలు, కాంగ్రెస్ పాలనలో అమలు అయిన దుర్మార్గాల గురించి మాట్లాడడం వారికి నచ్చకపోవచ్చు. నెహ్రూ, ఇందిరలు కాదు కదా, రాజీవ్‌గాంధీని సైతం వారు చూడలేదు. నరేంద్ర మోదీ మాత్రమే వారికి సుపరిచిత దేశ పాలకుడు, జాతీయ నాయకుడు. అందువల్ల వారి భవిష్యత్తును మెరుగుపరిచేందుకు ఏమి చేయాలన్నదే ప్రస్తుత పాలకుల కర్తవ్యం. కొత్త తరం యువతను ఆకర్షించేందుకు రాజీవ్‌గాంధీ 1988లో 18 ఏళ్ల వయస్సు వారికి ఓటు హక్కు కల్పించారు. 40 ఏళ్ల వయస్సులోనే ప్రధాని అయిన రాజీవ్ తనను తాను నవయువకుడుగా భావించుకున్నప్పటికీ 1989 ఎన్నికల్లో నాటి యువతరం ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించింది. బోఫోర్స్ కుంభకోణం, పెచ్చరిల్లిన ద్రవ్యోల్బణం, పెరిగిన నిరుద్యోగం, పత్రికా స్వేచ్ఛను నియంత్రించే ప్రయత్నాలు. షాబానో కేసు ద్వారా ప్రజలను మతపరంగా విడదీసేందుకు అనుసరించిన విధానాలే అందుకు కారణాలు.

# బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటులో కీలక ముందడుగు

**దేవరకద్రలో రక్షణ రంగ పరిశ్రమకు మార్గం సుగమం.**
**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కృషికి మరో ముందడుగు.**



(సమయం ప్రతినిధి దేవరకద్ర) : దేవరకద్ర నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు నేడు కీలక ముందడుగు పడింది, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) కృషి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఈ ప్రాజెక్టుకు మార్గం మరింత సుగమమైంది. దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ (DRDL) ఆధ్వర్యంలో చేపట్టనున్న బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఈ భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించేందుకు టీజీఐఐసీ (TGIIC) ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో జరిగిన సమావేశంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు శ్రీ దాదాపు సానుకూలంగా స్పందించడంతో దేవరకద్రలో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కీలక మద్దతు లభించింది. ఈ ప్రాజెక్టు దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిలోనే కాకుండా మహబూబ్‌నగర్ జిల్లాను రక్షణ రంగ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలవనుంది. బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ ప్రాజెక్టు దేవరకద్రకు రావడం ద్వారా స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి, మన ప్రాంత యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. దేవరకద్ర నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు, రక్షణ రంగ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి (GMR) చేస్తున్న ప్రయత్నాలకు ఈ పరిణామం గొప్ప ముందడుగుగా నిలిచింది. దేవరకద్రలో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ఏర్పాటుతో నియోజకవర్గం పారిశ్రామిక ప్రగతిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, యువత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్ పాలనకు 1,000 రోజులు.. గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధ వాతావరణంలో గడిపారని జగ్గారెడ్డి విమర్శించారు. స్వేచ్ఛ కావాలనే ఆకాంక్షతోనే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో పోలీసుల నిర్బంధాలు లేవని, మీడియాపై ఆంక్షలు విధించలేదని జగ్గారెడ్డి అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయానికి స్వేచ్ఛగా వెళ్లే అవకాశాన్ని రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అన్ని రంగాల్లో నియంతృత్వ ధోరణికి ముగింపు పలికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తీసుకొచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

**'త్యాగాలు విద్యార్థులవి.. పేరు మీకా' : జగ్గారెడ్డి**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేకపోయిందని జగ్గారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 1,000 రోజుల పాలనలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, రేషన్ కార్డులు పంపిణీ చేసి, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. తెలంగాణ కోసం వందలాది మంది విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారని జగ్గారెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని తామే సాధించామని చెప్పుకునే కేసీఆర్ కుటుంబంలో తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసిన ఒక్కరినైనా చూపించాలని ప్రశ్నించారు.

**కేసీఆర్ అసెంబ్లీకి రాకపోయినా నష్టమేం లేదు: జగ్గారెడ్డి**

కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నిస్తే కేటీఆర్ చెప్పే సమాధానం హాస్యాస్పదంగా ఉందని జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్ రాజీనామా చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబంలోని ముగ్గురు అసెంబ్లీకి రాకపోయినా ప్రభుత్వానికి ఎలాంటి సమస్య లేదని వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ అండ్ ఫ్యామిలీని కాంగ్రెస్ ఎప్పుడో లైట్ తీసుకుంది' అని జగ్గారెడ్డి అన్నారు.

**కేసీఆర్‌కు హక్కు లేదు: జగ్గారెడ్డి**

రాహుల్ గాంధీని విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు ఎక్కడిదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. విద్యార్థుల త్యాగాలను తన ఖాతాలో వేసుకున్న కేసీఆర్.. తెలంగాణ కోసం కృషి చేసిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను విమర్శించకూడదని జగ్గారెడ్డి హితవు పలికారు.

# 24.48 కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్

మహబూబ్‌నగర్ : నగరంలోని 2వ డివిజన్ ఏనుగొండలో 24.48 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర సమగ్ర అభివృద్ధిలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. యూజీడీ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.పి. వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, 2వ డివిజన్ కార్పొరేటర్ పెద్దగొల్ల నర్సింహులుతో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# నగరంలోని ప్రతి డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం : ప్రభుత్వ విప్



**15.17కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన**

మహబూబ్‌నగర్ : నగరంలోని ప్రతి డివిజన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం విడతల వారిగా చేపట్టనున్నట్లు ప్రభుత్వ విప్ లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి చెప్పారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా, నగరంలోని 20వ డివిజన్ పద్మావతి కాలనీలో ?15.17 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారం ఉండాలని ప్రజలు కూడా సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, అజ్మత్ అలి, 20వ డివిజన్ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకుందాం: ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**11.10 కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన**

మహబూబ్‌నగర్ : నగరాన్ని అందరి సహకారంతో అద్భుతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి అన్నారు. 19వ డివిజన్ తిమ్మసానిపల్లి లో 11.10 కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. యూజీడీ పనులతో నగరంలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, అజ్మత్ అలి, కార్పొరేటర్ తిరుమల శ్రీలత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయించుకోవాలి








**మహిళలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దు: ఎంపీ డీకే అరుణ**
**తొలి దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**సమయం: సెప్టెంబర్ 2, మహబూబ్‌నగర్ :** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా, క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాలానగర్ మండలంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదన్నారు. వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమవడంతో పాటు వైద్య ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను కోరారు. స్క్రీనింగ్‌లో అనుమానిత కేసులను గుర్తించిన వెంటనే తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న ఉచిత లేదా తక్కువ ఖర్చు వైద్య సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వారం తదితర క్యాన్సర్ల లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాలికలకు హెచ్‌పీవీ టీకాపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని కోరారు. "ఇంట్లో తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది" అని పేర్కొన్న ఎంపీ, ప్రతి ఒక్కరూ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**స్క్రీనింగ్ తర్వాత ఫాలోఅప్‌పై ప్రత్యేక దృష్టి**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల కారణంగా మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. క్యాన్సర్ లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. జిల్లాలో మహిళలకు విస్తృత స్థాయిలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ఎంపీ డీకే అరుణతో పాటు ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఫౌండేషన్‌కు జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. స్క్రీనింగ్‌లో క్యాన్సర్ అనుమానం ఉన్నవారిని అవసరమైన తదుపరి పరీక్షలు, చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయడంతో పాటు, వారి చికిత్స ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి కేసును సున్నితంగా పరిగణించి, స్క్రీనింగ్ అనంతరం అవసరమైన తృతీయ స్థాయి వైద్యం అందేలా ఫాలోఅప్ చేయాలని గ్రాణజ వైద్యులకు సూచించారు. స్క్రీనింగ్‌లో గుర్తించిన కేసులపై ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని, సంబంధిత మహిళలు ఎక్కడ చికిత్స పొందుతున్నారు, వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరమవుతోంది అనే వివరాలను తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అన్ని మండల కేంద్రాల్లో స్క్రీనింగ్: డీఎంహెచ్ఓ**

డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 850 మంది ఆశా కార్యకర్తల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 14 ఏళ్లలోపు బాలికలకు HPV వ్యాక్సిన్ అందించడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని తెలిపారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రేవంత్ రెడ్డికి పాలించే నైతికత లేదు





(సమయం ప్రతినిధి వనపర్తి) : కాంగ్రెస్ 1000రోజుల పాలన వైఫల్యంపై మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి సమరభేరి మోగించారు. రాజీవ్ చౌరస్తాలో జరిగిన నిరసన సభలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్మితే ఆగం అవుతాము అన్న కె.సి.ఆర్ మాట నేడు నిజమైంది అని అన్నారు.ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పాలించే నైతికత లేదని దుయ్యబట్టారు. కె.సి.ఆర్ సంక్షేమ పాలన మళ్ళీ రావడం తథ్యం అని సుభిక్షంగా పాలన సాగడం ఖాయమని ప్రజలు అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.వెల్లువలా తరలివచ్చిన మహిళలను చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం దినాలు దగ్గర పడ్డాయన్న ఖచ్చితంగా చెప్పగలనన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీలు,420హామీలు,11డిక్లేషన్లు ఒక్కటిగా వివరిస్తూ అమలు జరిగాయని మహిళలను ప్రశ్నిస్తే లేదు లేదు అని ముక్తకంఠంతో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చి అభివృద్ధి నీ అగ్రభాగములో నిలిపిన కె.సి.ఆర్ ని తూలనాడడం రేవంత్ రెడ్డికి తగదని హెచ్చరించారు.

**భారీ ఫ్లెక్సీ ప్రదర్శన :** సభాస్థలిలో ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీ చెందిన మోసపు హామీలు వివరిస్తూ 420ఫీట్లు భారీ ఫ్లెక్సి సభికులను విశేషంగా ఆకర్షించింది. 6 గ్యారంటీలు, 420హామీలు, 11 డిక్లరేషన్లు ఇచ్చి మోసం చేసిన రేవంత్ రెడ్డి బాగోతాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడంతో మహిళలు ఉద్వేగంగా మాట్లాడుతూ కాంగ్రెస్ చెడిన మోసపు హామీలు తలుచుకొని శాపనార్థాలు పెట్టారు. జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాకిటి.శ్రీధర్,రమేష్ గౌడ్,బి.లక్ష్మయ్య, నందిమల్ల. అశోక్, లక్ష్మారెడ్డి,కృష్ణా నాయక్,గంధం.పరంజ్యోతి,రాజానగరం. విజయ్ కుమార్,వెంకట్ సాగర్,కె.మాణిక్యం,వనం.రాములు,రాళ్ళ.కృష్ణయ్య,వెంకటస్వామి,ఏం.తిరుపతయ్య,మాజీ కౌన్సిలర్స్ ఉంగ్లం.తిరుమల్,నాగన్నయాదవ్,బండారుంకృష్ణ,కాగితాల.లక్ష్మీనారాయణ, కౌన్సిలర్స్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి,మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్,స్వాతి హరిబాబు,శంకరమ్మ బాబు నాయక్,ఏర్వ.అరుణ శ్రీనివాసులు, శిరీష రమేశ్ గౌడ్, హేమంత్ ముదిరాజ్, ఇమ్రాన్, రఘువర్ధన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి,సర్పంచులు శోభా,నాగమ్మ,కవితా నాయక్,షెమీం బేగం,జమ్ములమ్మ,నాయకులు ఏం.వేణుగోపాల్,పలుస.శంకర్ గౌడ్,నందిమల్ల. రమేష్,గులాం ఖాదర్ ఖాన్,నీలస్వామి,బొబ్బిలి.ప్రేమ్ కుమార్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల.రాము,మంద.రాము,సిరిగిరి.మన్నెం,బాలరాజు వాల్మీకి,శిరీవాటి. శంకర్, అలీమ్, నందిమల్ల.సుబ్బు,తదితరులు ఉన్నారు.

# దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి

**డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్**



వేకువ సమయం సెప్టెంబర్ 2 కీసర ప్రతినిధి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దివ్యాంగుల సదరం (UDID) సర్టిఫికెట్ల రెన్యూవల్‌తో పాటు కొత్త సర్టిఫికెట్ల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరుతూ, కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసరా పెన్షన్‌పై ఆధారపడుతున్న పేద, అర్హులైన దివ్యాంగులకు గడువులోగా సదరం సర్టిఫికెట్, మీ-సేవా దరఖాస్తు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సదరం సర్టిఫికెట్ లేని అర్హులు, రెన్యూవల్ అవసరమైన లబ్ధిదారులు అనేకమంది ఉన్నారని తెలిపారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ, స్లాట్ బుకింగ్, వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే మీ-సేవా కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దివ్యాంగులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 15వ తేదీలోపు ఆసరా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకుని, సదరం స్లాట్‌ను త్వరగా బుక్ చేసుకోవాలని సూచించారు. తలసేమియా, హిమోఫిలియా, సికిల్ సెల్ ఎనిమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు కూడా ఆసరా పెన్షన్‌కు అర్హులని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిప్యూటీ కలెక్టర్ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్

**దేవరకొండ నియోజకవర్గంలో 242 మంది లబ్ధిదారులకు రూ.1.12 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ**



**దేవరకొండ: సెప్టెంబర్ 2 (సమయం ప్రతినిధి) :** దేవరకొండ పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. వైఎస్సార్ పేరు చెబితే పేద ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సామాజిక న్యాయం గుర్తుకు వస్తాయని అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. "వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పేదల కోసం చేసిన సేవలు ప్రజల గుండెల్లో ఆయనను చిరస్థాయిగా నిలిపాయి. పేదవాడి కన్నీరు తుడవడమే నిజమైన రాజకీయమని ఆచరణలో చూపించిన మహానేత వైఎస్సార్" అని బాలు నాయక్ గారు అన్నారు.

**242 మంది లబ్ధిదారులకు రూ.1.12 కోట్ల సీఎం సహాయనిధి చెక్కులు**

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 242 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 12 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బాలు నాయక్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు కుటుంబానికి ఆర్థిక భారం ఎంత తీవ్రంగా ఉంటుందో నాకు తెలుసు. పేద కుటుంబం వైద్యం కోసం అప్పులపాలు కాకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం. అందుకే అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నాం అని ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న సహాయానికి ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. దేవరకొండలో డయాలసిస్ సేవల విస్తరణ.. 5 పడకల నుంచి 10 పడకలకు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ సౌకర్యాన్ని విస్తరించామని చెప్పారు.పేద రోగులకు వైద్యం అందుబాటులో ఉండాలి. డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకునే పరిస్థితి ఉండకూడదు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేసి, అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తాం అని బాలు నాయక్ అన్నారు.

**దివ్యాంగులకు మరింత చేరువగా సదరం సేవలు**

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ కోసం గతంలో నల్లగొండ జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి రావడంతో ప్రయాణం, సమయం, ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, అధికారుల సహకారంతో ఇప్పుడు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వారానికి రెండు రోజులు-ప్రతి సోమవారం, శుక్రవారం-సదరం క్యాంపులు నిర్వహించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం నల్లగొండకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే సేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వ సేవలు ప్రజల దగ్గరకు రావాలి.. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకూడదు. ఇదే ప్రజా పాలన లక్ష్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దివ్యాంగుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, వారికి అవసరమైన సంక్షేమ పథకాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**వైఎస్సార్ ఆశయాలతో.. రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సంక్షేమానికి పెద్దపీట**

దివంగత వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. "వైఎస్సార్ పేదల కోసం ఏ విధంగా ఆలోచించారో.. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పేదలకు వైద్యం, ఇళ్లు, రేషన్, రైతులకు సంక్షేమం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం" అని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో వైద్య, విద్య, రహదారులు, సాగునీరు, తాగునీరు, సంక్షేమం తదితర రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మారుపాక సురేష్ గౌడ్, చింతపల్లి మండల అధ్యక్షుడు జటావత్ హరినాయక్, చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఎరుకల వెంకటయ్య గౌడ్, ఊట్కూరి వేమన్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపుల్లో అప్రమత్తతే సైబర్ మోసాల నివారణకు రక్షణ





**సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు: ఎస్పీ డి.జానకి**
**వినాయక మండపాల్లో సైబర్ అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలి**

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా డిజిటల్ చెల్లింపుల సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా సైబర్ మోసాలను నివారించవచ్చని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అన్నారు. సోషల్ మీడియా వినియోగంలో వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ జాగృక్త దివాస్ సందర్భంగా బుధవారం జడ్చర్ల పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సుమారు 400 మంది విద్యార్థులకు నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ పేమెంట్స్, డిజిటల్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాలు, సోషల్ మీడియా భద్రత వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం/సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించరాదని ఎస్పీ సూచించారు. అపరిచితులు పంపించే లింకులు, క్యూఆర్ కోడ్‌లు, అనుమానాస్పద యాప్‌లను ఉపయోగించవద్దని తెలిపారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో నకిలీ వెబ్‌సైట్లు, తక్కువ ధరల పేరుతో వచ్చే నకిలీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులు లేదా వెబ్‌సైట్లకు ముందస్తుగా డబ్బులు చెల్లించే ముందు వాటి విశ్వసనీయతను పరిశీలించాలని సూచించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు చేస్తున్న పెట్టుబడి, ట్రేడింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా గ్రూపులు, అనుమానాస్పద యాప్‌లు, లింకులను నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో ఫోన్ నంబర్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫొటోలు, లొకేషన్ వంటి సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. తెలియని ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌లు, లింకులను అంగీకరించకుండా జాగ్రత్త వహించాలని, బలమైన పాస్‌వర్డ్‌లతో పాటు టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌ను ఉపయోగించాలని తెలిపారు. ప్రైవసీ సెట్టింగులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు.

**మోసం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయాలి :** సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే నగదు రికవరీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, తాము అప్రమత్తంగా ఉండటంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ కోరారు.

**వినాయక మండపాల్లో సైబర్ పోస్టర్లు :** అనంతరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విడుదల చేసిన సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ప్రత్యేక వినాయక పోస్టర్లను ఎస్పీ ప్రదర్శించారు. రాబోయే వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రతి వినాయక మండపం వద్ద ఈ పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వినాయక మండపాలకు వచ్చే భక్తులు, ప్రజలు పోస్టర్లను చూసి సైబర్ నేరాలపై అవగాహన పొందే అవకాశం ఉంటుందని, తద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలకు సైబర్ భద్రత సందేశాన్ని చేరవేయవచ్చని ఎస్పీ తెలిపారు. ప్రతి వినాయక మండపం సైబర్ నేరాలపై అవగాహన కల్పించే వేదికగా మారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఎస్పీ డి.జానకి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్, జడ్చర్ల ఇన్‌స్పెక్టర్ కమలాకర్, కళాశాల ప్రిన్సిపల్ సుకన్య, వైస్ ప్రిన్సిపాల్స్ నర్మదా, శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్, D4C సిబ్బంది, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## సెప్టెంబరు 5న దేవరకొండ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రారంభం

### ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసిన క్లబ్ సభ్యులు



దేవరకొండ : సెప్టెంబర్ 2 (సమయం ప్రతినిధి) : దేవరకొండ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరు తూ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ కి క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం మార్కెట్ యార్డ్‌లో క్లబ్ అధ్యక్షుడు జంతుక లింగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసిన ప్రతినిధులు, సెప్టెంబరు 5వ తేదీన నిర్వహించనున్న ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని కోరారు. ఈ సందర్భంగా విలేకరుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ భవిష్యత్ కార్యక్రమాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. విలేకరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

**420 అడుగుల భారీ ఫ్లెక్సీతో గద్వాలలో బీఆర్ఎస్ ర్యాలీ.. కృష్ణవేణి చౌక్‌లో ధర్నా**
**కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో**



సమయం ప్రతినిధి : జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో కృష్ణారెడ్డి బంగ్లా నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. అనంతరం 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ర్యాలీగా కృష్ణవేణి చౌక్‌కు చేరుకున్నారు. అక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మకూర్ తహసీల్ ముందు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన

ఆత్మకూర్ : Cpm పార్టీ ఆధ్వర్యంలోపేదలకు ఇళ్ల స్థలాలు ఇండ్లు పెన్షన్లు 4016 ఉపాధి హామీ సమస్యలు ప్రభుత్వ బడులలో సమస్యలు పరిష్కరించాలని ఆత్మకూరు ఎమ్మార్వో చాంద్ పాషా కి మెమొరండం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎస్ రాజు జిల్లా కార్యవర్గ సభ్యులు జిఎస్ గోపి మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో 2008లో సిపిఎం పోరాట ఫలితంగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించడం జరిగింది వాటికి హద్దులు చూపించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్హులైన పేదలందరికీ పెన్షన్లు ఇవ్వాలని భూమిలేని వ్యవసాయ కూలీలకు 12000 ఇస్తామన్న హామీని అమలు చేయాలని ఉపాధి హామీలో పెండింగ్ కూలి డబ్బులు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వ బడులలో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని మౌలిక వసతులు కల్పించాలని గృహిణిలకు నెలకు 2500 ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని పై డిమాండ్ల సాధన కొరకు ధర్నా నిర్వహించి తాసిల్దార్ గారికి మెమోరండం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల నాయకులు బుచ్చన్న రవి భారతీయుడు మరియు కృపధానం రత్నం దావీదు మునెప్ప కురుమూర్తి నారాయణ సత్యమ్మ రాములు రంగన్న రాములు వడ్డే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

మహబూబాబాద్ సెప్టెంబర్ 2 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసినటువంటి కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ శంకర్ నాయక్, ఈ సందర్భంగా శంకర్ నాయక్, మాట్లాడుతూ.... 6 గ్యారెంటీలు, 420 హామీల కాంగ్రెస్ బూటకపు పాలనను గడపగడపనా నిలదీద్దాం!

**కాంగ్రెస్ గ్యారెంటీలు కాదు... బాకీలే బాకీలు!**

ఆడబిడ్డలకు 2,500 అన్నారు – 33 నెలలకు 82,500 బాకీ.
అవ్వలు, బీడీ కార్మికులకు 4,000 పెన్షన్ అన్నారు – బాకీలే మిగిలాయి.
దివ్యాంగులకు 6,000 అన్నారు – 66,000 బాకీ.
కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్‌లో తులం బంగారం బాకీ.
డిగ్రీ ఆడబిడ్డలకు స్కూటీలు బాకీ.
ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో 12,000 కోట్ల బాకీ.
రైతు భరోసా, రుణమాఫీ, వరి బోనస్ – రైతుకు న్యాయం ఎక్కడ?
వరి బోనస్ 500 అన్నారు – బోనస్ బాకీ.
రైతు కూలీలకు 12,000 అన్నారు. బాకీ.
నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు అన్నారు– నిరుద్యోగ భృతి బాకీ.
విద్యా భరోసా కార్డు 5 లక్షలు అన్నారు – కార్డు బాకీ.
ఆటో కార్మికులకు 12,000 అన్నారు – బాకీ.
ఇది గ్యారెంటీల ప్రభుత్వమా బాకీల ప్రభుత్వమా?
ఇది ప్రజా పాలన కాదు... బాకీల పాలన!



కాంగ్రెస్ హటావో – తెలంగాణ బచావో!
బాకీలు వసూలు చేసే దాకా పోరాటం ఆగదు!
అనంతరం మహబూబబద్ మున్సిపాలిటీలోని ప్రతి షాప్ కి ప్రతి ఇంటికి వెళ్లి బాకీ కార్డులను పంపిణీ చేయడం జరిగింది!
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండలల పార్టీ అధ్యక్షులు,మండలల కమిటీ నాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు,మాజీ చైర్మన్,వైస్ చైర్మన్లు,మాజీ కౌన్సిలర్లు, తాజా కౌన్సిలర్లు,PACS మాజీ చైర్మన్లు,మాజీ డైరెక్టర్లు,AMC మాజీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ సర్పంచులకు, తాజా సర్పంచులు,తాజా ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు,మాజీ ఉపసర్పందులకు, గ్రామ శాఖ అధ్యక్షులకు కమిటీ నాయకులు, యువకులు,కార్యకర్తలు, సోషల్ మీడియా యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

**ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ఏబీవీపీ ఆందోళన**

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 02: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థుల విద్యాభవిష్యత్తు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉందని, పెండింగ్‌లో ఉన్న నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) నాగర్ కర్నూల్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ABVP నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు 800 విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు రాష్ట్ర పిలుపు మేరకు ముట్టడించడం ఆందోళన చేపట్టారు తక్షణమే అక్కడ ఉన్న ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి గారు విద్యార్థుల దగ్గరికి వచ్చి స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని విద్యార్థులకు తోడ్పాటుగా ప్రభుత్వం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగర్కర్నూల్ జిల్లా కన్వీనర్ మొక్తల శంతన్ మాట్లాడుతూ....స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఆలస్యం కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజు బకాయిల పేరుతో కొన్ని కళాశాలల్లో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని, దీనివల్ల పరీక్షలు, సర్టిఫికెట్లు, తదుపరి విద్యకు సంబంధించిన అంశాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**ABVP ప్రధాన డిమాండ్లు:**

1. అర్హులైన విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి.
2. ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.
3. విద్యార్థుల సర్టిఫికెట్లు, పరీక్షలు, తదుపరి విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి.
4. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులైన విద్యార్థులకు నిధులు అందేలా చర్యలు తీసుకోవాలి.



5. విద్యార్థుల సమస్యలపై మండల స్థాయిలో ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత ఉన్నతాధికారులకు వెంటనే నివేదించాలి.

"పేద విద్యార్థుల విద్యకు ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారకూడదు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి" అని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు ఉపశమనం కల్పించాలని, లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏబీవీపీ నాగర్ కర్నూల్ జిల్లా శాఖ స్పష్టం చేసింది. జిల్లా కేంద్రంలో బీసీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ హాస్టల్లో పక్క భవనాలు లేక సరిగా వసతులు లేక ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ యొక్క సమస్యలు తక్షణమే పురస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, తిమ్మాజిపేట మండల కన్వీనర్ వెంకటేష్, మల్లేష్, జీవన్, మార్కండేయ, జగన్, జ్ఞానేశ్వర్, లోకేష్, కీర్తన,, కృష్ణవేణి, ఏబీవీపీ నాయకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 22ఏ, రీ సర్వేలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ సెప్టెంబర్ 2 (వేకువ సమయం ప్రతినిధి): ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రీసర్వేకు ఎంపికైన (70) గ్రామాలలో సర్వే కొనసాగుతుందని, పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిస్టిక్ కలెక్టర్ స్నేహ శబరిష్, బుధవారం జిల్లాలోని తొర్రూరు మండల కేంద్రంలో రీ సర్వేకు ఎంపికైన జమిస్తాన్పురం, కానాపురం, వెంకటాపురం, కర్కాల, గోపాలగిరి, మడిపల్లి ( 6) గ్రామాలలో ఈరోజు జమస్తాన్పూర్ లో జరుగుతున్న రీసర్వేలు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు గ్రామంలో (190) ఎకరాల పట్టా భూములను సర్వే చేయడం జరిగిందని, జులై 10 నుండి సర్వే కొనసాగుతుందని, లక్ష్యం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం తొర్రూరు తహసిల్దార్ కార్యాలయంలో 22ఎ, పై నిషేధిత జాబితాలో వ్యవసాయతర భూముల ను సక్రమంగా గుర్తించాలని, భూ సమస్యలకు సంబంధించి రికార్డులలో ఎక్కడైనా వ్యవసాయ తర భూముల ప్రభుత్వ కార్యాలయాలు స్కూలు సబ్ స్టేషన్ తదితర అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వ సూచించిన ప్రకారం 22 ఏ, ను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను అందించాలని సూచించారు. ఈ పర్యటనలు కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, ల్యాండ్ రికార్డ్స్ ఏ డి శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

## -పాలమూరు నిరసన ఆందోళనలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళ వారం నాడు పాలమూరులోని తెలంగాణ కూడలిలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని పై విధంగా మాట్లాడారు. ఈ సందర్భంగా 420 ఫీట్ల భారీ బ్యానర్ను బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రదర్శించారు. మాజీ మంత్రి ప్రసంగిస్తూ తెలంగాణలో ఉద్యోగులు కూడా ఆందోళన పట్టారు.. గద్దెను ఎక్కిన వెంటనే కాంగ్రెస్ వారు ఇచ్చిన హామీలు మరిచిన్రు అన్నారు. కాంగ్రెస్ పరిపాలనలో వేల కోట్లు ప్రజలకు బాకీ పడ్డారని విమర్శించారు. చిన్నారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కొండా, కొంత మంది ఎమ్మెల్యేలు మాట్లాడిన మాటలు కూడా ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. వెయ్యి రోజుల ప్రభుత్వ ప్రకటనలో వాళ్ళు చెప్పిన విషయాలు చెప్పి ఉంటె బాగుం లేదని సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఢిల్లీలో ముఖ్యమంత్రి..మంత్రులు చక్కర్లు కొడుతున్నారని ఏద్దేవా చేశారు. రైతులు, వృద్దులు, మహిళలు, ఉద్యోగులు, ఏ వర్గాన్నీ పట్టించు కోకుండా పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. 22 ఏలో ప్రైవేట్ భూములను కూడా పెట్టారు.. దాని నుంచి బయటికి తీసుకువచ్చేందుకు డబ్బులు అడిగేందుకు ప్రభుత్వం ఇలా చేసిందని ఆరోపిస్తూ ప్రజలకు క్షమాపణ చెప్పి 22ఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి అరాచకాలు బాగా పెరిగాయి.. పేదల ప్రజలను వేధించిన మిమ్మల్ని మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా క్షేత్రం లో ఉంచుతామన్నారు.. ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వాలి.. విద్యార్థులు సర్టిఫికెట్ అడిగితే ఫీజు కట్టి తీసుకుపొమ్మని యాజమాన్యాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగ నియమమకాలు వెంటనే చేపట్టాలని ముదిరాజ్ లను బీసీ ఏ లో చేర్చాలి. పెంచుతామన్న పెన్షన్ ఇవ్వాలి.. గీత కార్మికులు, నేతన్నలకు, యాదవులు, రజకులు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణ ప్రాజెక్ట్ లను ఎండ బెట్టి ఆంధ్రకు సాగు నీటిని తరలిస్తున్నారు.. నికర జలాలు తీసుకెళ్తుంటే నోరు మెదపడం లేదని కాంగ్రెస్ పాలకులపై ధ్వజమెత్తారు. కృష్ణ బేసిన్ లో ఉన్న వారికీ సాగు నీరు లేదు.. పెన్నా లో ఉన్న వారికీ కృష్ణ నీరు ఇస్తున్నారని మా ప్రభుత్వం వచ్చిన వెంటనే రెసర్వాయర్లు నింజూఅ. రైతులకు సాగు నీరు ఇస్తామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ భారీ ర్యాలీ



దేవరకొండ: సెప్టెంబర్ 2 (సమయం ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిం చారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో దేవరకొండ పట్టణం గులాబీ మయంగా మారింది. ర్యాలీతో పట్టణం దద్దరిల్లింది. దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలు, యువజన నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగి బస్‌స్టాండ్ వద్దకు చేరుకుంది. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ జెండాలు, గులాబీ కండువాలతో భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో దేవరకొండలో పండుగ వాతావరణం నెలకొంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.

## గ్రామీణ వృత్తిదారులను ఆదుకోవడమే ప్రధాన ధ్యేయం: డిప్యూటీ మేయర్ MSR



(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న " తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ (TVVU)□□ 8వ రాష్ట్ర మహాసభల ప్రతినిధుల సమావేశానికి మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి (MSR) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ MSR మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం, దానికి అనుబంధంగా ఉన్న వృత్తిదారులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం మరియు స్థానిక సంస్థలు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాయని తెలిపారు. పాలమూరు జిల్లాలో వ్యవసాయ రంగం మరియు కూలీలు, వృత్తిదారుల హక్కుల కోసం యూనియన్ చేపడుతున్న పోరాటాలను, సేవలను ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు లేవనెత్తిన ప్రధాన సమస్యలను, డిమాండ్లను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ వృత్తిదారులు తమ హక్కు సాధన కోసం సంఘటితంగా ఉంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. నాగన్న, మైత్రి యాదయ్య, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హామీల అమలు కోసం... ప్రజల పక్షాన పోరాటం! దగా పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ సమరభేరి!





(సమయం ప్రతినిధి దేవరకద్ర) : దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నాడు భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో ముఖ్య అతిథులుగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ,ఆల ప్రీతి రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రసంగించారు. అలాగే బిఆర్ఎస్ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో 420 హామీలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, వాటిని తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు నినదించారు.వెయ్యి రోజుల దగా పాలనకు వ్యతిరేకంగా గళమెత్తిన బీఆర్ఎస్! 420 హామీల అమలుకు ప్రజల పక్షాన పోరాటం! చేస్తామని హామీలు అమలు చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

# వెయ్యి రోజుల పాలన.. అన్ని అబద్ధాలే..!



అబద్ధాల కోరు కాంగ్రెస్ సర్కారు.. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి రేవంత్..?
కెసిఆర్ పాలనలో ప్రశాంతంగా ప్రజా జీవనం.. కాంగ్రెస్ రాకతో దుర్భర స్థితిలో జనం..
ఆరు గ్యారెంటీలు అమలు చేసేదాకా పోరాటం తప్పదు..
షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ధ్వజం
కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై షాద్ నగర్ పట్టణ కూడలిలో ఆందోళన
కాంగ్రెస్ 420 హామీలతో రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన
అంజయ్య యాదవ్ పిలుపుతో గులాబీమయమైన షాద్ నగర్ చౌరస్తా
కాంగ్రెస్ సర్కార్ పై భారీ నిరసన ప్రదర్శన

(సమయం ప్రతినిధి షాద్నగర్) ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు.. ఎన్నికలు అయ్యాక కూడా అబద్ధాల మీదనే పాలన నడిపిస్తున్నారు.. ఇదెక్కడి న్యాయం సీఎం .. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారు..? మీరు అమలు చేయకపోతే పోరాటాల ద్వారా మేమే మెడలు వంచి అమలు చేయిస్తాం.. అంటూ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన పేరును నిరసిస్తూ పట్టణ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వెయ్యి రోజులు పాలన చేసి కూడా ప్రజాకాంక్షలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, అందుకే ఈ పోరాటానికి అధిష్టానం ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో కెసిఆర్ పాలనలో కెసిఆర్ కిట్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామాలు, పట్టణాలను ఎంతగానో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కానీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆదాయ వ్యయాలను చూసుకోకుండా ఇష్టారాజ్యంగా మేనిఫెస్టో తయారుచేసి ప్రజలను తప్పుదారి పట్టించి అధికారంలోకి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు గడిచి వెయ్యి రోజులు అవుతున్న ఇప్పటిదాకా 6 గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తమ తప్పులు ఒప్పుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని, కాలేశ్వరం లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు, రైతులకు ఉచిత కరెంటు వంటి ఎన్నో కార్యక్రమాలు చేసిన కేసీఆర్ ను తప్పు పట్టడం కాంగ్రెస్ చేతకానితనమని పేర్కొన్నారు. ఉచిత బస్సు ఇచ్చి చేయి దులుపుకున్న రేవంత్ రెడ్డి మహిళలకు 2500 పెన్షన్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వికలాంగులకు 6000 పెన్షన్ ఇస్తామన్నారని ఇప్పటిదాకా దానిని అమలు చేయలేదని పేర్కొన్నారు. టబీఆర్ఎస్ హయాంలో వైకుంఠ దామాలు, ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు వంటివి నిర్మించి పట్టణ గ్రామీణ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్కు కెసిఆర్ ను తిట్టడం తప్ప మరో పని లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చుదాక తమ పార్టీ పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కెసిఆర్ 200 రూపాయల పెన్షన్ 2000 చేశారని, దీనిని 4000 చేస్తానన్న రేవంత్ రెడ్డి ఎందుకు మాట తప్పారని ప్రశ్నించారు. రైతుబంధుకు 15000 ఇస్తామని చెప్పి గతంలో తమ ప్రభుత్వం ఇచ్చినంత కూడా ఇవ్వకుండా వేధిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగివచ్చేదాకా పోరాటం తప్పదని, సర్కారు మెడలు వంచి మరి గ్యారెంటీలు అమలు చేసేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపుమేరకు నియోజకవర్గం నలుమూలల నుండి గులాబీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చాయి. కాంగ్రెస్ 420 హామీలను పురస్కరించుకొని 420 అడుగుల ఫ్లెక్సీని రూపొందించారు. ఈ కార్యక్రమంలో నేతలు వి. నారాయణరెడ్డి, ఎమ్మె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, నరేందర్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్, మాజీ స్త్రీ, శిశు సంక్షేమ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి తదితరులు, అలాగే మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి 191 ఎకరాల భూసేకరణ

(సమయం ప్రతినిధి రంగారెడ్డి) : లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు రిజర్వాయర్ నిర్మాణానికి రైతుల నుండి 191 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి వివరించారు. బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు లక్ష్మీదేవి పల్లె రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ పనులు సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 27 మండలాలు ఐదు డివిజన్ లు ఉన్నాయని తెలిపారు. మొదటి విడతగా జిల్లాలోని 108 గ్రామపంచాయతీలకు రీ సర్వే కోసం నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. జిల్లాలో 281 మంది లైసెన్సుడు కలిగిన సర్వేయర్లను ప్రభుత్వం తీసుకోవడం జరిగిందని వివరించారు. ఒక్కొక్క సర్వేయర్ నెలకు 500 ఎకరాల వరకు సర్వే చేయవచ్చుని, వారికి ఎకరాకు 60 రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందని వివరించారు. షాద్ నగర్ డివిజన్ లో మూడు గ్రామపంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందని, జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని తూంపల్లి, ఫరూక్ నగర్ మండల పరిధిలోని సూర్యారావు గూడ, కేశంపేట మండలంలోని చింతకుంటపల్లి గ్రామాలను రీ సర్వే కోసం ఎంపిక చేసినట్లు వివరించారు. విడతలవారీగా రంగారెడ్డి జిల్లాలో ఉన్న 611 గ్రామపంచాయతీలో సర్వేలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 22 ఏ భూములను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. 22ఖ, భూభారతిలో ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు నేరుగా అధికారులను మాత్రమే సంప్రదించాలని మధ్యవర్తులను సంప్రదించరాదని సూచించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 22 ఏ పై పకడ్బందీగా రివ్యూ చేశామని తెలిపారు. సర్వేలో వస్తున్న సమస్యలను పరిష్కరించేందుకే డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అసైన్డ్ భూములు ఎవరైనా కొనుగోలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నిబంధనల మేరకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని వివరించారు. ఈ డివిజన్లో కేవలం 5 ఎకరాలు మాత్రమే పెండింగ్ లో ఉందని, త్వరలోనే పరిష్కరించి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ రా పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని వివరించారు. 22ఖ లో కోర్టు వివాదంలో ఉన్న భూములను పెట్టలేదని వివరించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు పోకుండా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డిఓ సరిత, తాసిల్దార్ నాగయ్య తో పాటు వివిధ మండలాల తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



**జిల్లాలోని 108 పంచాయతీలకు రిజర్వే కోసం నోటీసులు**
**22 ఏ భూముల గుర్తింపు పనులు ప్రశాంతంగా జరిగాయి**
**భూ సమస్యలపై రైతులు నేరుగా అధికారులను సంప్రదించాలి**
**అసైన్డ్ భూములు తీసుకుంటే క్రిమినల్ కేసులు**
**రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా అదన కలెక్టర్ చంద్రారెడ్డి**

## అసైన్మెంట్ భూములకు రుణాల ఆప్షన్ ఇవ్వాలి: మంత్రి పొంగులేటికి వినతి



వేకువ సమయం సెప్టెంబర్ 2 కీసర ప్రతి నిధి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ రాష్ట్ర ప్రతినిధుల బృందం కలిసింది. సంస్థ డైరెక్టర్ పుట్టపాగ శ్రీని వాస్ ఆధ్వర్యంలో అసైన్మెంట్ భూముల రైతులకు భూభారతి పోర్టల్ ద్వారా బ్యాం కు రుణాలు పొందే అవకాశం కల్పించాల ని మంత్రికి వినతిపత్రం అందజేశారు. అసైన్మెంట్ భూములకు భూభారతి పోర్టల్‌లో మోర్టిగేజ్ ఆప్షన్ కేటాయించి, రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది కీసర మం, యాద్గార్ పల్లి గాలిగళ్ల సాయిబాబా మాట్లాడుతూ.. అసైన్మెంట్ రైతుల సమస్యపై గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అంది స్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధుల బృందం సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ పైనే చర్యలు తీసుకోవాలి - మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!

**తనపై చర్యలు తీసుకుంటే బీసీలంతా ఏకమవుతారు - హెచ్చరిక**

హైదరాబాద్, సెప్టెంబర్ 01 (వార్త నిర్భయం) : తనపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ పదేళ్ల పాటు తానే సీఎం అని చెప్పుకుంటున్నారని, దీనిపై మంత్రులు, సీనియర్ నేతలు కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని ఆమె అన్నారు. తన బిడ్డ వాస్తవాలనే మాట్లాడిందని, అందులో తప్పేముందని ప్రశ్నించారు."నన్ను రాజీనామా చేయమని ఇప్పటి వరకు పార్టీలో ఎవరూ చెప్పలేదు. నేను ఏ తప్పూ చేయలేదు. నా బిడ్డ చెప్పింది నిజాలు. తనపై చర్యలు తీసుకుంటే బీసీలంతా ఏకమవుతారు" అని హెచ్చరించారు.రేవంత్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ లో అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి ఉందని, ఒంటెద్దు పోకడలతో పార్టీని నడిపిస్తున్నారని, సీనియర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు.తాను బీసీ బిడ్డనని, బీసీల ఆత్మగౌరవం కోసమే పోరాడుతున్నానని, తనను అణగదొక్కాలని చూస్తే బీసీ సమాజం ఊరుకోదని కొండా సురేఖ స్పష్టం చేశారు. కాంగ్రెస్ హైకమాండ్ వెంటనే జోక్యం చేసుకుని రేవంత్ రెడ్డి వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 39.4 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ నగరంలోని 6వ డివిజన్ ఏనుగొండలో 39.4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. నగర సమగ్ర అభివృద్ధిలో భాగంగా యూజీడీ వ్యవస్థను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.పి. వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, 6వ డివిజన్ కార్పొరేటర్ అనుపటి రామస్వామితో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమే

**బిఆర్ఎస్ నేతలు రోడ్లపై ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు**
**పదేళ్ల పాలనలో అనేక స్కామ్‌లు జరిగాయి**
**దళితులకు మూడెకరాల భూమిని రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేస్తా అని చెప్పిన కెసిఆర్ ఎందుకు చేయలేదు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఎన్ని ధర్నాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు, అవినీతి ఆరోపణలు ఎదురయ్యాయని, మైనింగ్, వైన్స్ తదితర అంశాల్లో పెద్ద ఎత్తున స్కామ్‌లు జరిగాయని విమర్శించారు. "దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పిన కేసీఆర్.. ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదు?" అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం, వాస్తవంగా ఎంతమంది దళితులకు మూడెకరాల భూమి ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలకు దిగుతున్నారని అన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యానించారు.

## అభివృద్ధిలో మహబూబ్‌నగర్‌ను అగ్రగామిగా నిలుపుతాం: ప్రభుత్వ విప్

మహబూబ్‌నగర్ : నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 1వ డివిజన్ తిమ్మసానిపల్లిలో ?17.71 కోట్లతో చేపట్టనున్న యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. యూజీడీతో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అనంతరం తిమ్మసానిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏఐ ల్యాబ్‌లు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆధునిక సాంకేతిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ దేప్లీ మేగ్యా నాయక్ , వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## అమరచింతలో మున్సిపాలిటీ పట్టణ అభివృద్ధి పనులకు శ్రీకారం...
# రూ.9.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం...

అమరచింత : వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ఈరోజు ప్రారంభించారు. అమరచింత.. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మొత్తం రూ.9.50 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.7 కోట్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.2.50 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పట్టణంలోని పలు కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు మక్తల్ నియోజకవర్గ mla మంత్రి వాకిటి శ్రీహరి నిధులు మంజూరు చేయడంతో అమరచింత పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈరోజు బీసీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

**ఏళ్ల తరబడి సమస్యలకు పరిష్కారం**

బీసీ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా సరైన సీసీ రోడ్లు లేకపోవడం, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారడం, మురుగునీరు సక్రమంగా వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో ప్రజల జీవనం ఇబ్బందికరంగా మారిందని కాలనీవాసులు తెలిపారు.

ఇప్పుడు మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో తమ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రజల్లో హర్షం... మంత్రికి కృతజ్ఞతలు..**

అభివృద్ధి నిధులు మంజూరు చేసి అమరచింత పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరికి బీసీ కాలనీ వాసులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. అమరచింత పట్టణవాసి నాగరాజు గౌడ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ, వైస్ చైర్మన్ రాధ అరుణ్ కుమార్ ,పట్టణ అధ్యక్షుడు రవికాంత్, జిల్లా కార్యదర్శి తెలుగు రమేష్, మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, అమరచింత మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**అభివృద్ధి దిశగా అమరచింత**

రూ.9.50 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు పూర్తయితే అమరచింత పట్టణ రూపురేఖలు మారనున్నాయని ప్రజలు భావిస్తున్నారు. మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య వ్యవస్థతో ప్రజలకు సౌకర్యవంతమైన జీవనం అందుతుందని, పట్టణం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మా 1000 రోజుల అభివృద్ధి లెక్క ఇదిగో....మీ పదేళ్ల లెక్క ఏమిటో చెప్పండి

-రూ.2,389 కోట్ల అభివృద్ధి.. శ్వేతపత్రంతో లెక్క చెబుతాం.
-10 ఏళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.
-కేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి, వెలిగొండపై ఘాటు వ్యాఖ్యలు.
-విపక్షాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్.




**వనపర్తి. సమయం ప్రతినిధి :** ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రకటించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2,389 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఆరు గ్యారంటీల అమలుకు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, తమ ప్రభుత్వం 1000 రోజుల్లో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే వారు గత పదేళ్లలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. “మా 1000 రోజుల అభివృద్ధి లెక్క ఇదిగో.. మీ పదేళ్ల లెక్క ఏమిటో చెప్పండి” అంటూ ప్రతిపక్ష నేతలను నిలదీశారు.

**కేఎల్ఐపై ఎవరి వాటా ఎంత?**

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ఏమీ చేయలేదంటూ చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే తిప్పికొట్టారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి హయాంలో డీ-5, డీ-8, బుద్ధారం ప్రాంతాల్లో వేల ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు పనులు జరిగాయని పేర్కొన్నారు. కర్నెతండా, బుద్ధారం, ఖిల్లాఘణపురం బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి సుమారు 45 వేల ఎకరాలకు నీరందించే పనులకు టెండర్లు పూర్తయ్యాయని, 50 శాతం పనులు గతంలో జరిగితే మిగిలిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తామే ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకోవడం సరికాదని, గతంలో చేసిన పనులకు ఇప్పుడు రాజకీయ రంగు పులుముతున్నారని విమర్శించారు. కేఎల్ఐలో 90 శాతం పనులు పూర్తయిన తర్వాత మిగిలిన 10 శాతం పనులు చేసి మొత్తం తామే పూర్తి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

**“నా డబ్బులు తిన్నాలేదు అంటే వెంకటేశ్వరస్వామి గుడికి రండి”**

తనపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలపైనా ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. “నేను కూలీని.. నా డబ్బులు పందికొక్కులు తిన్నారో లేదో తేల్చుకుందాం. వెంకటేశ్వరస్వామి గుడికి రండి.. నేను వస్తా.. మీరు సిద్ధమా?” అంటూ సవాల్ విసిరారు.తాను భూమి కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనని, ఆ వ్యవహారానికి జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సాక్షిగా ఉన్నారని చెప్పారు. 39 గుంటల భూమిని ఎవరి పేరున రాసి ఇవ్వమన్నా ఇస్తానని పేర్కొన్నారు. దీనిపై రఘుపతిరెడ్డి మీడియా సమావేశం పెట్టి వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**“వెలిగొండపై పదేళ్లలో ఏం చేశారు?”**

వెలిగొండ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ గత పదేళ్లలో ఏం చేశారో ప్రతిపక్ష నేతలు సమాధానం చెప్పాలని మేఘారెడ్డి ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి, వెలిగొండ, కేఎల్ఐ ప్రాజెక్టుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు రూ.182 కోట్లు చెల్లించామని, అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు.

**“ప్రధాన నాయకుడు ఎక్కడ?”**

బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే.. “1000 రోజుల్లో 22 కోట్ల జీతం ఇచ్చాం.. 22 రూపాయల పని చేశారా?” అంటూ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం లోటుపాట్లను సరిచేస్తూ 76 వేల ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది పాఠశాలలు మూతపడ్డాయని ఆరోపించారు.పింఛన్ల విషయంలోనూ గత ప్రభుత్వాన్ని నిలదీశారు. వయస్సు పరిమితిని 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది ఎవరి ప్రభుత్వమో ప్రజలకు తెలుసన్నారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని వారు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు.

**“ప్రజల ముందే లెక్కలు తేల్చుకుందాం”**

డీసీసీ జిల్లా అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మేధావులమని చెప్పుకునే నాయకులు ప్రజలకు ఎలాంటి దారి చూపుతున్నారో ఆలోచించుకోవాలని అన్నారు.“మీకన్నా మేము మూడు ఆకులు ఎక్కువే చదువుకున్నాం. బూట్లు నాకే వ్యవస్థ ఎవరిదో ప్రజలకు తెలుసు” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో అప్పుల చెల్లింపులకు భారీగా నిధులు వెచ్చిస్తూ, ఇరిగేషన్ రంగానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.పాలమూరు-రంగారెడ్డి, కేఎల్ఐ ప్రాజెక్టులను తామే ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకునే ముందు గత పదేళ్ల లెక్క చెప్పాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. వనపర్తి నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్. మాజీ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా పార్టీ కార్యవర్గం, కౌన్సిలర్లు, సర్పంచు లు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అంకాలమ్మ-కాటమయ్య జాతర..
## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ:చందంపేట: సెప్టెంబర్ 2 (సమయం ప్రతినిధి): చీత్రియాల గ్రామంలో అంకాలమ్మ-కాటమయ్య జాతర భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. ఈ జాతర సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గ్రామానికి చేరుకుని కాటమయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కాటమయ్య గుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్ , అనంతరం ఆలయ సమీపంలోని రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలను ప్రారంభించారు. గ్రామంలో రాత్రివేళ ప్రజలకు, భక్తులకు మెరుగైన వెలుతురు అందించడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం శ్రీ అంకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక పూజలు, మొక్కులు నిర్వహించారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, నియోజకవర్గంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి. రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలి. ప్రతి కుటుంబంలో ఆనందం, సౌభాగ్యం నిండాలి. నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అంకాలమ్మ తల్లిని మనస్ఫూర్తిగా కోరుకున్నా అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ఎమ్మెల్యే ఆలయానికి చేరుకున్న సందర్భంగా గ్రామస్తులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. జాతర ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే భక్తులతో కలిసి జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం**

జాతర కార్యక్రమాల అనంతరం చీత్రియాల గ్రామంలో ఐదు ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన పేద కుటుంబాలకు లిసొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ దశలవారీగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయిస్తున్నట్లు చెప్పారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. ఒక కుటుంబానికి సొంత ఇల్లు రావడం అంటే ఆ కుటుంబానికి భరోసా, భద్రత, గౌరవం లభించినట్టే. అందుకే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది అని బాలు నాయక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో గ్రామాల్లో పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు, వారికి శాశ్వత నివాస భద్రత కలుగుతుందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చీత్రియాల గ్రామంలో ఐదు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం జరగడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బాలు నాయక్ కి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి జాతరలో భక్తి.. ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంట ఆనందం అన్నట్టుగా గ్రామంలో ఒకవైపు ఆధ్యాత్మిక వాతావరణం, మరోవైపు పేద కుటుంబాలకు సొంతింటి సంతోషం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, చందంపేట మాజీ ఎంపీపీ ఏడుపుల గోవింద్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ కాకునూరి రంగయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి జర్పుల భధ్యా నాయక్, దేవరకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు, ఉమ్మడి చందంపేట మండల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీఐసీసీఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా, ఉమ్మడి వరంగల్
## ఏడు జిల్లాల ఇన్‌చార్జిగా డా. ధరంసోతు సీతారాం నాయక్ నియామకం




మహబూబాబాద్: సెప్టెంబర్ 02 (వేకువ సమయం ప్రతినిధి): గిరిజన పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, యువత, మహిళా పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి రంగాల అభివృద్ధి కి కృషి చేస్తున్న ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (TICCI) తెలంగాణ చాప్టర్లో డా. ధరంసోతు సీతారాం నాయక్, ను మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాలకు ఇన్‌చార్జిగా నియమించినట్లు టీఐసీసీఐ తెలంగాణ చాప్టర్ అధ్యక్షులు డా. ధరావత్ శ్రీనివాస్ తెలిపారు.డా. ధరంసోతు సీతారాం నాయక్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తూ టీఐసీసీఐ నుంచి అధికారికంగా నియామకం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహబూబాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాల్లో గిరిజన పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువత కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించడం, వారికి అవసరమైన అవగాహన, మార్గదర్శకత్వం వ్యాపార అవకాశాలతో అనుసంధానం చేయడం తన బాధ్యతల్లో భాగంగా ఉంటుందని డా. సీతారాం నాయక్ తెలిపారు. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ వ్యాపార రుణాలు, ఎంఎస్ఎంఈ అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, వెండర్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ కొనుగోళ్లు మార్కెట్ అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సెప్టెంబర్ 4న పారిశ్రామికవేత్తల అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 2026 సెప్టెంబర్ 4న హన్మకొండ నయిమ్ నగర్‌లోని హోటల్ అరోమాలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు పారిశ్రామికవేత్తల అవగాహన ప్రత్యేక వెండర్ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించనున్నారు. నేషనల్ ఎస్సీ-ఎస్టీ హబ్, భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, టీఐసీసీఐ తెలంగాణ చాప్టర్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ పథకాలు ప్రభుత్వ రాయితీలు, వ్యాపార అభివృద్ధి విస్తరణ, బ్యాంకు రుణాలు ఆర్థిక అవకాశాలు, జీఈఎం వేదిక ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు వెండర్‌గా మారే అవకాశాలు, సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ మెంటరింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారు, కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు, బిజినెస్ లోన్ కోసం ప్రయత్నిస్తున్న వారు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, వ్యాపారులు, సేవా రంగానికి చెందిన వారు ఎస్సీ/ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని కార్యక్రమంలో పాల్గొనాలని టీఐసీసీఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జి డా. ధరంసోతు సీతారాం నాయక్, కోరారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

**సంప్రదించడానికి డా. దారంసోతు సీతారాం నాయక్, మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త & ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జి – టీఐసీసీఐ 9908550822**

## దేవరకద్ర సబ్‌స్టేషన్ నుండి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వినతిపత్రం



(సమయం ప్రతినిధి దేవరకద్ర)మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ లో రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతుల కరెంటు కష్టాలు కేసీఆర్ తీర్చారు. 2014 కు ముందు కరెంట్ పరిస్థితి ఏంటో రైతులకు బాగా తెలుసు.. ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి తెలంగాణ చీకటిమయం అవుతుందన్నారు.. అదంతా అబద్ధమని కెసిఆర్ రుజువు చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. విద్యుత్ సరఫరా పై కెసిఆర్ ప్రతిరోజు మానిటరింగ్ చేసేవారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి విద్యుత్ డిమాండ్పై అవగాహన లేదు.కరెంటు కష్టాలను పట్టించుకునే వారే లేరు.కరెంట్ ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు.కెసిఆర్ గారు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి మెయింటైన్ చేయడం కూడా రావట్లేదు.వ్యవసాయానికి 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా జరగడం లేదు.విద్యుత్ సరఫరా చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం గోసపెడుతుంది.నీళ్లు, ఎరువులు, బోనస్, విద్యుత్, పంట కొనకుండా,పెట్టుబడి సాయం ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతుంది. రైతుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య గట్టింది. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## డాక్టర్ వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రామేశ్వరమ్మ
గద్వాల పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళి

సమయం ప్రతినిధి : ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 17వ వర్ధంతిని పురస్కరించుకొని గద్వాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి డిసిసి వైస్ ప్రెసిడెంట్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామేశ్వరమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ లు మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ... పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ప్రాజెక్టులు మరియు ఎత్తిపోతల పథకాల ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగు నీటి కొరత తీర్చిన ఘనత మహానేతకు దక్కుతుందన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు, సత్యం, మాజీ కౌన్సిలర్లు సీనియర్ నాయకులు తుమ్మల నరసింహులు, మురళి, ఇసాక్, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాల శ్రీను, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు గోవిందు, జమ్మిచేడు సతీష్, కురుమన్న, నాగేంద్ర యాదవ్, ధర్మనాయుడు, సుదర్శన్, ఇలియాస్, కౌసర్, రిజ్వాన్, కిఫాయత్, శ్రీనివాస్ యాదవ్, కోప్షన్ మెంబర్ షరీఫ్, రమేష్ రెడ్డి, వీరేష్, మహేందర్, మోయిన్, రామచంద్రి, మేదరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బెడ్లు లేక.. నేలపైనే చిన్నారికి చికిత్స!

గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో దయనీయ పరిస్థితి



గద్వాల: గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో బెడ్లు అందుబాటులో లేక ఓ చిన్నారిని నేలపైనే పడుకోబెట్టి చికిత్స అందిస్తున్న దృశ్యం కనిపించింది. రోగుల సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల వార్డులో అదనపు బెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పరిశుభ్రత, మౌలిక వసతులను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బాలానగర్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభం

## మహిళలు ముందస్తు పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి నయం చేయొచ్చు: ఎంపీ డీకే అరుణ



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బాలానగర్ ఎంపీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ. శ్రీనివాసులు, క్యాన్సర్ వైద్య నిపుణులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మహిళల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు పరీక్షలు నిర్వహించేందుకు క్యాంప్ ఏర్పాటు చేయాలని ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్‌ను కోరినట్లు తెలిపారు. స్పందించి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేసినందుకు ఫౌండేషన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో క్యాన్సర్ ఉన్నట్లు చివరి దశలో గుర్తించడంతో చికిత్స ఖర్చులతో అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యేవని అన్నారు. ప్రస్తుతం ముందస్తు స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే అవకాశం ఉందని, సకాలంలో చికిత్స అందిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అయినందున ప్రతి ఒక్కరూ దానిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీ సూచించారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే పెద్ద శస్త్రచికిత్సలు అవసరం లేకుండానే చికిత్స ద్వారా నియంత్రించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యాంప్‌లో వివిధ రకాల క్యాన్సర్లకు సంబంధించిన అవసరమైన పరీక్షలు నిర్వహించడంతో పాటు, క్యాన్సర్ అనుమానం ఉన్నవారికి వ్యాధి ఏ దశలో ఉంది, ఎలాంటి చికిత్స అవసరం అనే విషయాలపై వైద్య నిపుణులు సలహాలు, సూచనలు అందిస్తారని చెప్పారు. రాష్ట్రంలో వేలాది మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, మహబూబ్‌నగర్ జిల్లాలో 359 మంది మహిళలు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు ఎంపీ తెలిపారు. క్యాన్సర్ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

**హెచ్‌పీవీ టీకాపై అవగాహన అవసరం**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత ఉందని ఎంపీ తెలిపారు. 9-14 ఏళ్ల బాలికలకు రెండు డోసులు, 14--26 ఏళ్ల యువతులకు మూడు డోసుల హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. "ప్రతి ఇంట్లో తల్లి ఆరోగ్యం బాగుంటే కుటుంబం మొత్తం బాగుంటుంది" అని ఎంపీ అన్నారు. బాలానగర్ మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, జిల్లా దీజీవీ అధ్యక్షుడు సాయినాథ్, బాలానగర్ మండల బీజేపీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, రాజాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ మాసోత్సవాల కార్యక్రమాల పోస్టర్, కరపత్రాశీ ఆవిష్కరణ



**మహబూబాబాద్ సెప్టెంబర్ 2 (వేకువ సమయం ప్రతినిధి):** గాంధీ చూపిన అహింసా శాంతి మార్గాలు ప్రపంచ దేశాలకే మార్గదర్శనమని, ప్రస్తుత యాంత్రిక పరిస్థితుల్లో మళ్లీ గాంధీ ఇజం అవసరం ఎంతైనా ఉందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లో,గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్-2 నుండి అక్టోబర్ -2 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో గాంధీజీ సిద్ధాంతాలు, ఆలోచనలను వాళ్ల మనసులోకి ఎక్కేలా ప్రచారం చేసే గాంధీజీ మాసోత్సవాల కార్యక్రమాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నాటి భారత దేశ స్వాతంత్ర సంగ్రామం, మొదలు నిన్న మొన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ప్రజలు అహింసాయుత శాంతి మార్గాల్లోనే విజయం సాధించారనేది నిత్య సత్యమని, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అనేక ప్రజా పోరాటాలు శాంతి ఉద్యమాలకు మహాత్ముడే ఆదర్శం అని పేర్కొన్నారు.ప్రముఖ సైకాలజిస్ట్ గాంధీజీ రీసర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో నిత్యం హింస ప్రవృత్తి, హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు అనేకం చోటుచేసుకుంటున్నాయని, ఉన్నత సాంస్కృతిక ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన భారతదేశం ఆత్మహత్యలు, నిరక్షరాస్యత, అవినీతిలో ముందంజలో ఉండటం బాధాకరమని, ఇటువంటి పరిస్థితులకు పరిష్కార మార్గాలుగా మనం మళ్లీ మూలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ క్రమంలో భారతదేశం ఒక సంపూర్ణమైన ఎదుగుదలతో కూడిన, వికాసంతో పరిణితి చెందిన మనస్తత్వం గల యువతి యువకులుగా ఎదగడానికి, కౌమార దశలో సరైన మార్గ నిర్దేశం చేస్తూ విద్యార్థులను జాగృతం చేయాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఆక్రమంలోనే గత 20 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం గాంధీజీ మాసోత్సవాలు నిర్వహిస్తూ విద్యార్థులను ఒక మంచి ఆలోచనల దిశగా పయనించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ముందుగా గాంధీజీ ఆలోచనలు సిద్ధాంతాలను ప్రచారం చేసే కార్యక్రమాలను నిర్వహించి, ప్రతి జిల్లాలో ప్రపంచ శాంతి గాంధీ మార్గం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు అక్టోబర్ రెండవ తారీకు నాడు గాంధీ జయంతి రోజున బహుమతులు ప్రశంస పత్రాలు ఆయా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ సమాజంలోని మేధావులు, సామాజికవేత్తలు సహకరించి దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలి: డిసిఆర్బి డీఎస్పీ



**పెద్దమందడి సెప్టెంబర్ 02:** డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో అవగాహనతో కూడిన జాగ్రత్తలే ప్రధాన ఆయుధాలని వనపర్తి డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్ అన్నారు.వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఆదేశాల మేరకు బుధవారం పెద్దమందడి మండలం మోజర్లలోని ప్రభుత్వ హార్టికల్చర్ కళాశాలలో డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్, సైబర్ క్రైమ్ ఎస్సై రవిప్రకాష్ పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి గార్ల ఆధ్వర్యంలో "సైబర్ జాగ్రత్త దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా రూపొందించిన "వినాయకుడు మనకు నేర్పే సైబర్ జాగ్రత్తలు" అనే సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్‌ను డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్ ఆవిష్కరించారు. వినాయకుడి ప్రతిరూపం ద్వారా సైబర్ నేరాల పట్ల ప్రజలకు, ముఖ్యంగా యువతకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన ఈ అవగాహన పోస్టర్‌లోని సందేశాలను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. "సైబర్ ప్రపంచంలో అప్రమత్తతే రక్షణ. ఒక్క చిన్న నిర్లక్ష్యం భారీ ఆర్థిక నష్టానికి, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి కారణమవుతుంది. ఆలోచించి క్లిక్ చేయండి.. జాగ్రత్తగా షేర్ చేయండి.. సురక్షితంగా ఉండండి" అని విద్యార్థులకు సూచించారు.ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆన్‌లైన్ కార్యకలాపాల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.విద్యార్థులు తప్పనిసరిగా పాటించాల్సిన సైబర్ జాగ్రత్తలు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దు.అనుమానాస్పద లింకులు, వెబ్‌సైట్లు, మెసేజ్‌లను క్లిక్ చేసే ముందు వాటి నిజస్వరూపాన్ని నిర్ధారించుకోవాలి.తక్కువ సమయంలో అధిక లాభాలు, బహుమతులు, ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మవద్దు.OTP, PIN, పాస్‌వర్డ్, బ్యాంక్ ఖాతా,



ATM/క్రెడిట్ కార్డు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దు. తెలియని యాప్స్, ఫైళ్లు, లింకులను డౌన్‌లోడ్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలి.సోషల్ మీడియా లేదా వీడియో కాల్స్‌లో పరిచయమైన వ్యక్తుల పేరుతో వచ్చే అభ్యర్థనలను వెంటనే నమ్మకుండా వారి నిజమైన గుర్తింపును నిర్ధారించుకోవాలి.ముఖం కనిపిస్తే నమ్మొద్దు.. గుర్తింపును నిర్ధారించుకోండి" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలి. తప్పుడు వార్తలు, ఫేక్ లింకులు, అనుమానాస్పద మెసేజ్‌లను ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా ముందుగా నిజానిజాలను తెలుసుకోవాలి. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకొని, సాధ్యమైన చోట రెండు దశల భద్రత (Two-Factor Authentication)ను వినియోగించాలి. సైబర్ నేరం జరిగిన తర్వాత బాధపడటం కంటే.. జరగకముందే జాగ్రత్త పడటం మేలు" అని డీఎస్పీ తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు.సైబర్ నేరానికి గురైనప్పుడు భయపడకుండా వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సైబర్ నేరాలపై మరింత సమాచారం, ఫిర్యాదు కోసం www.cybercrime.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్, సైబర్ క్రైమ్ ఎస్సై రవిప్రకాష్, పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, షీ టీం ఎస్సై అంజద్, ప్రభుత్వ హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్, డా,,వీణజ్యోషి అధ్యాపకులు, సైబర్ పోలీస్ సిబ్బంది విజయ్ కుమార్, లోకేష్, పవణ్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085